# రేపటి స్త్రీ

## అరవింద



ఆయన ఆఫీసునుంచి ఇంటికి వస్తూనే అన్నారు.

''సీతగారికి ఇల్లు కావాలిట. ప్రయత్నించినా దొరకటం లేదుట ఎక్కడా. మన ఔట్ హౌస్ ఇద్దామా!"

వంగి బూటు లేసు విప్పుకుంటూంతటంవల్ల ఆయన మొహం చూడలేకపోయాను నేను. సీత భర్తకూడా మా వారి ఆఫీసులో ఆయనతో బాటే ఉద్యోగం చేసేవాడు. రెండు నెలల కిందట అతను రోడ్ ప్రమాదంలో పోయాడు. ఆ రెండు రోజులూ ఆఫీసువాళ్ళు చాలా సాయం చేశారు. తరవాత ఆవిడకి కావలసిన వాళ్ళు వచ్చారు. మిగతా విధులన్నీ పూర్తి చేశారు. పుట్టింటికి రమ్మని అడిగాడు ఆవిడ అన్నగారు. 'ఇక్కడే ఉంటాను, ఉద్యోగం దొరికితే' అందిట సీత. అంతా కలిసి ప్రయత్నించారు. ఆవిడ గ్రాడ్యుయేట్ కాదుగానీ మెట్రిక్ పాసయింది. ఆఫీసువాళ్ళు సానుభూతి చూపించారు. స్టెనోగా వేసుకుంటామన్నారు.

ఆవిడకి ఇద్దరు పిల్లలున్నారు. ఉద్యోగం దొరికింది... ఎందుకో ఇల్లు ఖాళీ చెయ్యమన్నారుట, ఇంటివాళ్లు. ఎందుకో ఏమిటి, సీత అంత అద్దె ఇవ్వలేదని, ఇంకెవరేనా కొత్తవాళ్ళకి ఎక్కువ అద్దె కిద్దామని—సీత ఇల్లు వెతుక్కోవటం మొదలు పెట్టింది.

అసలు నేనే ఆలోచిస్తున్నాను, వెనకాల రెండు గదులూ ఖాళీగానే ఉన్నాయి. ఇద్దామని అడిగితే ఇంకా ఊరుకుంటానా! స్త్రీకి స్త్రీ శత్రువు కారాదు.

"తప్పకుండా ఇద్దాం, వెంటనే వచ్చి ఇంట్లో చేరమనండి" అన్నాను.

సీత మరునాడే వచ్చేసింది. సామాను సర్దుకుంటూ, అక్కడ నిలబడిన నన్ను చూసి "మీరు ఇప్పుడు చేసిన మేలు మరిచిపోలేను," అంది.

నేను నవ్వి ఊరుకున్నాను.

న్యాయంగా చూస్తే ఇది మేలుకింద లెక్క రాదు. మనిషి మనిషికి చేసే సాయం. ఒకరి అవసరం ఇంకొకరికి ఎప్పుడూ ఉంటుంది సంఘంలో. కానీ సీత 'మేలు అనటానికి కారణం ఉంది.

ముప్పైఏళ్ళ సీత, భర్తలేని సీతకి ఇల్లు ఇవ్వటానికి అందరూ భయపడుతున్నారు. యవ్వనంలో మొగవాడి అండలేని స్త్రీని ప్రపంచం రకరకాలుగా వేధిస్తుంది.

ఏ మాత్రం బలహీనత బయటబడినా తరిమి తరిమి కొడుతుంది.

ఈ పరిస్థితుల్లో సీతకి నేను చేసినది ''మేలు" అనే అనిపించుకుంటుంది.

కొన్ని రోజులు బాగానే గడిచిపోయాయి. సీత, నేను స్నేహంగానే ఉన్నాము. ఆవిడ పిల్లలిద్దరూ స్కూల్‌కి వెళ్ళివస్తున్నారు. ఆవిడ ఉద్యోగం చేస్తోంది. పిల్లలు కలిసి ఆడుకుంటున్నారు. కానీ ఆ తరవాత రోజులు బాగా గడవటం మానేశాయి.

నాకూ నీకూ ఎంత దూరమో నీకూ నాకూ అంతే దూరం కానవసరంలేదు,

వస్తువుల విషయంలో ఆ లెక్క

రైట్, కానీ మనుషుల విషయంలో కాదు.

సీత దృష్టిలో స్నేహమంటే ఏమిటో, మేలు అంటే ఏమిటో ప్రత్యుపకార మంటే ఏమిటో, నాకు అర్థంకాలేదు.

కానీ వాటన్నింటికీ బదులుగా దొరికిన ప్రతిఫలం మాత్రం బాధాకరంగా ఉంది.

ఆయనా, సీతా ఆఫీసునుంచి కలిసి ఇంటికి వచ్చేవారు. ఆలస్యంగా వచ్చేవారు.

ఆదివారం ఇద్దరికీ ఆఫీసు ఉండేది. నాకు తెలియని సంగతులు మాట్లాడుకునేవారు. మా పిల్లల్ని సీత పిల్లల్ని ఇంటి దగ్గర నేను చదివించేదాన్ని, ఆడించేదాన్ని.

నన్ను చూసి ఇరుగూ పొరుగూ నవ్వుతున్నారు, చెవులు కొరుక్కుంటున్నారు.

అది నేను పట్టించుకోలేదు కానీ, నా మనసుని పటించుకోకుండా ఉండలేక పోతున్నాను.

ఒకరోజు నేను నిద్రలేచేటప్పటికి... మధ్యలో మెలకువ వచ్చి...ఆయన లేరు పక్కన. అట్లాగే కూర్చున్నాను. కొంచెంసేపటికి ఔట్ హౌస్ తలుపు చప్పుడయింది. తరువాత ఆయన లోపలికి వచ్చారు. నన్ను చూసి గాబరా పడ్డారు. కానీ ఏమీ మాట్లాడలేదు దుప్పటి కప్పుకుని పడుకున్నారు. నేనూ మాట్లాడలేదు. మాట్లాడటానికి ఏమీ లేదనిపించింది. మర్నాడు రాత్రి ఆయన నామీద చెయ్యివేస్తే తీసేశాను.

"నా కిష్టంలేదు" అన్నాను.

"నీకు అసూయ" అన్నారు.

"కాదు. అసూయకి అతీతంగా ఉండాలని" అన్నాను.

"ఐతే మరెందుకు దూరంగా పోతున్నావూ'' అంటూ మళ్ళీ చెయ్యివేశారు.

నవ్వాను. చెయ్యి మళ్ళీ తీసేశాను.

ఆయన నావైపు అర్థంకానట్టు చూసి పడుకున్నారు.

మర్నాడు ఆయన ఆఫీసునుంచి వచ్చేప్పటికి సామాను సర్దుకున్నాను. పిల్లల్ని సిద్ధంచేశాను. అంతా చూసి

"అలక కాబోలు" అన్నాను.

"కాదు,అర్థం వెతుక్కుంటున్నాను" అన్నాడు.

"వెతుక్కో. బాగా వెతికి వెతికి మళ్ళీ ఇక్కడికే, నాదగ్గిరికే వస్తావు.'' అన్నారు.

అమ్మ దగ్గిరికి వచ్చేశాను. స్కూల్లో టీచరు ఉద్యోగం దొరికింది, వెంటనే జేరాను. చేరాక వేరే ఇల్లు అద్దెకి తీసుకున్నాను. పిల్లలూ, నేనూ స్కూలికి వెళ్ళి వస్తున్నాం. ఒక రోజు ఆయన వచ్చారు. తనతో రమ్మన్నారు.

"నీకు బుద్ధిలేదు నన్ను నవ్వులపాలు చేస్తున్నావు" అన్నారు.

"ఒకరిని ఇంకొకరు నవ్వులపాలు చెయ్యలేరు. మనని మనమేచేసుకుంటాం. మీ దగ్గర ఉండగలిగితే అసలు వచ్చేసేదాన్నేకాదు. పెళ్ళి అయినంత మాత్రాన ఇష్టంలేని బంధాలు మనుషుల్ని కట్టెయ్యలేవు. మీకు అన్ని విధాల సీత తగిన మనిషి. సీతతో మీకు నచ్చినట్లుగా బ్రతకండి" అన్నాను.

"నన్ను ఏడిపించకు. అయిందేదో అయిపోయింది. పద. సీతని పంపించేద్దాం" అన్నారు.

ఆడదానికి ఆడది శత్రువు అంటారు.

మగవాడు ఆడే ఈఆటకి నా గుండె భగభగ మండింది. కత్తిచేసిన గాయం లాగ రక్తం స్రవించింది.

సీతతో కలాపం జరిపి నా బ్రతుకు గాయం చేశారు.

ఇప్పుడు అవసరం తీర్చుకుని ఆ సీతని వీధిలోకి తరిమేస్తారుట, పేరు తిరిగి ప్రతిష్ఠించుకోటానికి ఎంతకేనా తగుదురు.

ఆడది ఇటువంటి అన్యాయం ఎన్నటికీ చెయ్యలేదు.

"నేను రాను" అన్నాను.

"చదువుకుని ఆడవాళ్ళు చెడిపోతున్నారు." అంటూవెళ్ళిపోయారు ఆయన.

ఆ ఊరు వదిలేశారుట. సీత ఆయన భార్య అయింది! పిల్లలు వాళ్ళ పిల్లలయ్యారు!

ఒక సమస్యని నేను సమంగా పరిష్కరించాను.

నేను నమ్మి మోసపోయాను కానీ ఎవరినీ మోసం చెయ్యలేదు. నేనూ ఆడదాన్నే. కానీ ఇంకొక స్త్రీకి శత్రువుని కాలేదు, అని ఋజువు చేశాను. సీతకి సాయం చేశాను. సీత నాకు అపకారం చేసిందా? సీతకి నేను శత్రువుని కాలేదు కానీ నాకు సీత శత్రువే అంటుంది లోకం.

నేను దుర్బలురాలినైతే ఆ మాట నిజమే.

కానీ స్త్రీకి స్త్రీని శత్రువుగా చేయగల మగవాడు నాకు అవసరంలేదు.

నేను నా కాళ్ళమీద నిలబడగలను. నా పిల్లల్ని నేను పెంచుకో గలను.

నా గుండెలో రూపుదిద్దుకుని, నా కలల్లో రాజ్యంఏలే "అతడు" నాకు ఎప్పటికైనా కనిపిస్తే నేను "మళ్ళీ పెళ్ళి" చేసుకోవటానికి జంకను! సంతోషంగా అతడిని నా భర్తగా స్వీకరిస్తాను.

అని గొంతెత్తి చెప్పాలని పిస్తుంది. ఋజువు చేసి చూపించాలనిపిస్తుంది. సబలగా నిడబడాలనిపిస్తుంది. కానీ... కానీ...కానీ...

నేను చదువుకోలేదు. నేను ఉద్యోగం చెయ్యలేను. నాకు నలుగురు పిల్లలు,

నాలుగు గోడలమధ్య నా కథ ఇది కాదు.

* * *

ఆయనకి మంచి ఉద్యోగం ఉంది. ఆస్థి ఉంది. ఇల్లుకూడా ఉంది. ఇంటికి వెనక భాగంలో రెండు గదుల ఔట్ హౌస్ ఉంది. మా పెళ్లి అయినప్పుడు

ఇవన్నీ చూసి అందరూ నన్ను “అదృష్ట వంతురాలు” అన్నారు. కానీ పెళ్లి జరుగుతున్న క్షణంలోనే నాకు తెలిసి పోయింది నేను అంత అదృష్టవంతురాలిని కాదని. ఎన్నోసార్లు తలెత్తి చూసిన నా చూపులతో అతడి చూపులు కలవలేదు. ఒక పక్క బ్రాహ్మడు మంత్రాలు చదువుతుంటే పెళ్లి కొడుకు పెళ్లితంతు గమనించకుండా, పెళ్లి కూతుర్ని కూడా చూడటం మానేసి పెళ్లికొచ్చిన ఒక చుట్టాలమ్మాయినే అదే పనిగా చూట్టం మొదలు పెట్టాడు.



నాగవిల్లి అయ్యాక విడిదికి తీసికెళ్ళారు విశ్రాంతిగా కూర్చున్నాము. “ఎర్రచీర కట్టుకుని మంగళహారతి పాడింది. ఆ అమ్మాయి ఎవరు? నీకేమవుతుంది; పెళ్ళయిందా?” అనడిగారు.

అప్పటిదాకా నన్ను గురించి ఒక్క ప్రశ్న కూడా వెయ్యలేదు.

“నాకు తెలీదు!” అన్నాను. మనసులో ఏదో వెలితి ఏర్పడింది. అతడికే నా గురించి చెప్పాలని అతడి గురించి ఎన్నో సంగతులు తెలుసుకోవాలని ఉంది. అతడి స్నేహితులు, అతడికి సినిమాలు ఇష్టం...అతడేమైనా మాట్లాడితే వినాలని...అతడికి పాటలు ఇష్టమా? కానీ నోరు విప్పి ఒక్కమాట కూడా అనలేక పోయాను.

రాత్రి భోజనాలుచేస్తున్నాం. ఆయనకి రెండో వైపున వాళ్ళచెల్లెలు కూర్చుంది.

ఎర్రచీర కట్టుకుని మంగళహారతి పాడిన అమ్మాయి ఇప్పుడు నీలం పట్టు చీర కట్టుకుని వడ్డిస్తోంది. అప్పటికే నేను ఆ అమ్మాయి వివరాలు కనుక్కున్నాను.

మా పిన్ని ఆడబిడ్డట. నేను ఇదివరకెప్పుడూ చూడలేదు. కొంచెం నలుపే కానీ ఒడ్డూ పొడుగూ ఉంది. బెరుకు లేకుండా నవ్వుతూ మాట్లాడుతుంది. బాగా పాడుతుందిట. ఆ అమ్మాయిని చూపించివాళ్ళ చెల్లెల్ని అడిగారాయన.

“ఆ అమ్మాయి ఎవరో తెలుసా?”

తెల్లబోయాను నేను. ఆ కుతూహలం చూసి. రోషంకూడా కలిగింది.

వాళ్ళ చెల్లెలు తెలీదు అన్నట్లుగా తలాడించింది. నేను గబగబా అన్నాను.

“నేనుకనుక్కున్నాలెండి. వరలక్ష్మి ఇంకా పెళ్ళి కాలేదు. ఉద్యోగంచేస్తోంది. ఇరవై నాలుగేళ్లు.”

“పాపం పెళ్లికాలేదూ!” బాగుంది కదూ” అన్నారు.

ఎవరిమీదో తెలీదుకానీ నా మనసంతా జాలితో నిండిపోయింది.

“అందరూ వచ్చిచూసి పిల్ల నచ్చిందనే అంటున్నారట, కానీవాళ్లు కట్నాలు ఇవ్వలేరుట. అందుకే పెళ్ళి కాలేదు ఇంకా” అన్నాను.

అంటూంటే నాలో జాలే కాదు, కసి కూడా ఉందనిపించింది. ఈయనకూడా ఎనిమిదివేలు కట్నం తీసుకున్నారు. నాకుకూడా మా అక్కయ్య కిచ్చినట్లు ఆరువేలు కట్నం ఇద్దామనుకున్నారు మా నాన్న. వీళ్ళు ఒప్పుకోలేదు. ఇంకెవరో ఎనిమిదివేలిస్తా నన్నారుట.

“ఏం చేస్తాం. ఇవ్వాలిమరి. రెండు వేలకోసం మంచి సంబంధం వదులుకోవటం ఎందుకు!” అన్నారు నాన్న.

నేను గదిలోతలుపేసుకుపడుకునిఏడిచాను. తమ్ముడికి టైఫాయిడ్ వచ్చింది. డాక్టర్ హార్లిక్స్, పళ్ళు ఇవ్వండి అని చెప్పాడు. వాడికిఅన్నంపెట్టడం మొదలు పెట్టగానే హార్లిక్స్ కొనటం మానేశారు నాన్న. వాడు నాన్న రాగానే “ఆపిల్స్ తెచ్చారా?” అనడిగేవాడు.

“బత్తాయిలు అయిపోయాయి” అనేది అమ్మ.

“మరిచిపోయాను.” అని ఇద్దరికీ ఒకటే సమాధానం చెప్పేవారు నాన్న.

అమ్మ ఒక్క పట్టుచీర కొనుక్కోవాలి అని ఎప్పటినుంచో అనుకొంటుంది. కానీ ఇంతవరకూ కొనుక్కోనేలేదు. అక్కయ్య పెళ్ళికి కూడా చాలా ఖర్చుంది, తరువాత కొనుక్కుందువుగానిలే అని నాన్న ఉట్టి జరీ చీర కొని పెట్టారు.

వాళ్ళ అవసరాలు, సరదాలు అన్నీ మానుకుని, నేను సుఖపడాలని ఇప్పుడు ఈ రెండువేలు ఎక్కడనుంచి తెద్దా

మనుకుంటున్నారో!...అప్పు చెయ్యాలి. అంతేగా!

"నేను చదువుకుని ఉంటే, ఉద్యోగం చేసేదాన్ని. ఈ సంబంధం ఒప్పుకునే దాన్నికాదు" అనుకున్నాను కోపంగా.

ఇప్పుడు అవన్నీ మనసులో పైకి వచ్చాయి. సంతోషం విరిగిపోయినట్లుగా ఉంది.

"బాగుంటే వరలక్ష్మిని చేసుకోపోయారా? ఒకవేళ ఆ అమ్మాయిని ఇంతకు ముందు చూడటం సంభవించినా మీరు చేసుకుని ఉండేవారు కాదు. మీకు కట్నం కావాలిగా. వాళ్ళు ఇవ్వలేరుమరి" అని నిష్ఠూరాలాడా లనిపించింది.

ఐనా ఊరుకుంటారా? కళ్ళకినచ్చితే అవసరం లేకపోయినా ఆరాధియ్యటం!

అందం అందరికీ ఆనంద కారణమే కానీ ప్రతి స్త్రీలో ఆనందాన్ని వెతుక్కుంటే ఆ మొగవాడు ప్రమాదకరమే వరలక్ష్మిని తెచ్చి ఆయన పక్కన కూర్చోపెట్టి ఎక్కడికైనా పారిపోవాలని పించింది.

మొదటి రాత్రి సమీపించటం నాకు సంతోషం కలిగించలేదు.

తలుపులు మూసుకోవటం నాకు వణుకు తెప్పించింది. మంచంమీద కూర్చున్న ఆయన రమ్మన్నట్లు చెయ్యి ఊపారు. దగ్గరగా వెళ్ళాను. మిఠాయి పళ్ళెం, పాలూ ఉన్నాయి బల్లమీద. పళ్ళెం తీసుకుని, బర్ఫీలడ్డూ తిన్నారు. నానోటికి లడ్డూ అందించారు. నాకు తినాలని లేదు. నోట్లోంచి తీసేసిబల్లమీద పెట్టాను.

"ఇష్టం లేదా? అందుకే ఇట్లాగున్నావు సన్నగా" అన్నారు.

పాలు తాగారు.

ఆయన పాలుతాగుతుంటే కిటికీదగ్గర నిలబడ్డాను.

"ఇక్కడ ఏంచూస్తున్నావు!" అని నా చెయ్యి పట్టుకుని లాగారు.

ఆ ఊపుకి నేను మంచంమీదపడ్డాను. నేను తెల్లబోయాను. కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

కన్నెపిల్లల ఊహలు కలలు అని ఎందుకంటారో నాకు పగిలిన నా కలల మేడ చూసి అర్థమైంది. అన్నీ ఆఒక్క క్షణంలోనే.

పగిలిన కలల మధ్యనుంచి నాఊహా మూర్తి "అతడు" నా వైపు జాలిగా చూశాడు. గాఢంగా నిట్టూర్చి, బాధగా కళ్ళు మూసుకున్నాను.

అప్పుడే అనుకున్నాను "నేనంత అదృష్టవంతురాల్ని కాదని"

నేను మెట్రిక్ కూడా పాసుకాలేదని, నాకు ఏమీ తెలియదనుకుంటారుఆయన, శ్రీనివాసమూర్తిగారు. కానీ నా మనసు ప్రతి విషయాన్ని ఇట్టే పసిగట్టేస్తుంది. ముఖ్యంగా మనిషి మాట్లాడినా, నవ్వినా ఆ మనిషి స్వభావం, ఆలోచనా నాకు గాజుపెట్టెలో పెట్టిన బొమ్మలాగ కనిపించేస్తాయి. ఇది ఆయన విషయంలో మరీ స్పష్టంగా ఉంటుంది.నాకు ఈదృష్టి లేకుండా ఉండినా బాగుండును అనిపిస్తుంది చాలాసార్లు. ఎందుకంటే నేను గ్రహించిన ఆయన ఆలోచనలన్నీ నాకు బాధ కలిగించేవే.

నేను సన్నగా పొట్టిగా ఉంటాను. ఆయన పొడవుగా బలిష్ఠంగా ఉంటారు.

"ఆ చీర కట్టుకో, కొంచెం లావుగా కనిపిస్తావు. బాగుంటావు. రోజూ పాలు తాగుతూ ఉండు. బుగ్గలు వస్తాయి." అనేవారు. అంటే ఆయనకి ఇప్పుడు నేను నచ్చనట్లే కదా!

నిర్లిప్తంగా నవ్వేదాన్ని కానీ లోపల ఏడుపు వచ్చినట్లుండేది.

"అవన్నీ చేస్తే అందం వస్తుందా? రాదు, రాదు" అనుకునేదాన్ని.

సినిమాకి వెడితే ఆయన చూపులు అందమైన ఆడవాళ్ళమీదే ఉండేవి.

ఎవరినో చూపించి ఆవిడ బాగుంది కదూ అనేవారు.

నే నింకా ఎదిగిపోవాలనిపించేది. ఇంకా ముడుచుకుపోయేదాన్ని.

నేను గొంగళిపురుగుని అనిపించేది నాకు. సీతాకోకచిలకలా మారాలనిపించేది నాకు. కోరిక ఎంత గొప్పది! మనసులో కోరిక ఉంటే మనసెంత నిండుగా ఉంటుంది, ప్రతిక్షణం సంతోషంగా ఉంటుంది. ఈ ప్రపంచం, మనుషులూ అద్భుతంగా మారి అందంగా కనిపిస్తారు. ఆనందం ఎక్కడినుంచో ఊరిపోతున్నట్లుగా ఉంటుంది దేనిలోనో ఐక్యం కావాలనే లేమి బయలుదేరి మనిషిని నిలవనీదు.

చెట్టుకు పూసివున్న గులాబీలని చూస్తే నాకు అట్లాగే ఉంటుంది.

చెట్లమీద మబ్బులమీద నేలమీద నింగిలోనూ నిండి పొరలిపోతున్న వెన్నెలని చూసినా నాకు అట్లాగే ఉంటుంది. ఎవరి కంఠంలో నుంచైనా శృతిమధురమైన సంగీతం వినిపిస్తే ఎవరినో వెతుక్కోవా లనిపిస్తుంది. "అతడి" ఛాతీమీద కన్నులరమూసి విశ్రమించి ఆనందపులోతులు చూడా లనిపిస్తుంది.

ఒక చిన్నపాపాయి నవ్వుకోసం పురిటి నొప్పులు పడటం కూడా నా కిష్టమే.

ఇవన్నీ నా కోరికలు.

అందమైన స్త్రీని చూస్తే, ఆ కళ్ళూ, మెడా, చేతులూ...ఆయనకిఅంతేనేమో!

కానీ నేను సన్నగా,పొట్టిగా ఉంటాను. చిన్నతనం, భయం బాధనాలో!

ఐనా తృప్తి, సంతోషం కలిగించా లని తాపత్రయం.

ఆయనకి తృప్తి కలిగిస్తే గర్వం.

ఆయన పుచ్చుకునేవారు. నేనుఇచ్చే దాన్ని. ఆయన ప్రభువు. నేను దాసిని. కానీ ఇచ్చేవారు త్యాగధనులు, పుచ్చుకునేవారు స్వార్థపరులు.

భయం, బాధ, గర్వం, తాపత్రయం, సంతోషం అసంతృప్తి అన్నీ కల గాపులగం.

ఏళ్ళు గడుస్తున్నాయి. పిల్లలుపుట్టారు పుట్టింటికి వెళ్ళేదాన్ని కాదు అతడి కోరికకి ఏవేళా అడ్డుచెప్పేదాన్ని కాదు.

అదంతా ప్రేమేనా? ఆ ప్రశ్నకి నాకు సిగ్గువేసేది.

అది ప్రేమకాదు, పోరాటం. ప్రతి క్షణం నాకు పరీక్ష.

పాలు తాగేదాన్ని, హైహీల్డ్ షూ వేసుకునేదాన్ని రకరకాల సౌందర్య సాధనాలు వాడేదాన్ని ఇవన్నీ చేస్తుంటే బలిఇవ్వటానికి మేపుతున్న మేకపిల్ల గుర్తుకు వస్తుండేది.

మోహన్‌కి పెళ్ళి అయింది. పార్టీకి వెళ్ళాం. పెళ్ళికూతురు సీత అందంగానే ఉంది. పొడుక్కి తగ్గ లావుగా, లావుకి తగిన ఒంపులతో శిల్పంలాగ; చిత్ర కారుడు గీసిన బొమ్మలాగ ఉంది. ఆ కళ్ళు, మెడ, జుట్టు, నడుమూ చూస్తు న్నాను.

"పెళ్ళి కూతురు బాగుంది కదూ" అన్నారు ఆయన పక్కన నిలబడి.

నేను అనుకున్న మాటే ఆయనఅంటే ఉలికిపడ్డాను కళ్ళదాకా నీళ్ళువచ్చాయి. ఇప్పటికీ ఆ మాట మరిచిపోలేదు నేను. నా చుట్టూ ఎందరో సీత లున్నారు, ఎందరో వరలక్ష్మ లున్నారు. అందరూ బాగుంటారు. అందంగా ఉంటారు. ఆరో గ్యంగా ఉంటారు. నేను ఒక్కతెనే బాగుండను. ఆ మాట నా గురించి ఎప్పుడూ అనలేదు ఆయన.

"మీ భార్య ఒక్కతే బాగుండదు! లలిత ఒక్కతే బాగుండదు ఈ ప్రపంచంలో..." అనుకున్నాను. మళ్ళీ మళ్ళీ అనుకుంటూనే ఉంటాను నాలో.

ఏళ్ళు గడుస్తున్నాయ్. సీతకి ఇద్దరు పిల్లలు పుట్టారు.

"మాకు ఇద్దరు చాలు" అంది సీత నవ్వుతూ.

అప్పటికి మాకు నలుగురు పిల్లలు. సీత మాటలకి సిగ్గువేసింది. చిన్నతనం కలిగింది.

సీత కూడా ఎక్కువేమీ చదువుకో లేదు. ఐనా చూసేవాళ్ళు అట్లా గను కోరు.

ఎన్నో సంగతులు నిర్భయంగా మాట్లాడుతుంది. మోహన్ ఆ అమ్మా యిని అన్ని చోట్లకి తీసికెడతాడు. ఇద్దరూ ఎన్నో సంగతులు చర్చించు కుంటారు.

"సీతకి నిజంగా మోహన్ అంటే ఇష్టమేనా?" అని నాకు అనుమానం.

మోహన్ సన్నగా ఉంటాడు. అందంగా ఉండడు. కానీ ఇద్దరూ ఆనందంగా ఉన్నట్లే కనిపించేవారు. పాపం సీత దురదృష్టవంతురాలు. సుఖంగా, నిర్విచారంగా వాళ్ళసంసారం సాగిపోతూంటే ఏక్సిడెంట్ అయి మోహన్ పోయాడు.

ఆఫీసువాళ్ళు, స్నేహితులు అందరూ వెళ్ళి ఓదార్చారు. ధైర్యం చెప్పారు. నాలుగు రోజుల తర్వాత ఎవరి పనుల్లో వాళ్లు పడిపోయారు. సీత తన సమస్య లతో ఒంటరిగా మిగిలింది. అన్నగారు తనతో రమ్మంటే వెళ్లలేదు. ఉండి పోయింది ఇక్కడే. ఉద్యోగానికి ప్రయ త్నించింది. ఉద్యోగం దొరికింది. ఇల్లు కావాలని నాకుకబురుచేసింది. నాఇంటిని ఎవరో లాక్కోవటానికి వస్తున్నట్టుగా నాకు భయం వేసింది.

ఐనా వెంటనే 'లేదు' అనలేక పోయాను. ఊళ్లోనే ఉన్న మా పిన్నిని సంప్రతించాను. 'ఇల్లు'ఇవ్వకు అంది పిన్ని. "మగవాళ్లని నమ్మకూడదు" అంది.

పిన్ని సమాధానం నాకు తృప్తి కరంగా ఉంది.

"మా అత్తగారు, బావగారు వస్తారు. ఇల్లు ఇవ్వలేము" అని కబురు చేశాను.

సీత ఇల్లు అడిగినట్లు ఆయనకి చెప్ప లేదు.

నాది అసూయా? అసహాయతా?

సీతకి ఇల్లు ఇవ్వాలని, ఆయన సీతతో ఒక అన్నయ్యలాగ మెలగాలని, మా సహాయంతో సీత, పిల్లలూ అభి వృద్ధిలోకి రావాలని నాకు నిజంగా కోరిక ఉంది. కానీ! సీత అనూరాధ గారిని కూడా ఇల్లు అడిగిందిట. ఆవిడ ఎమ్మే చదివింది. ఉద్యోగం కూడా చేస్తోంది. పెద్ద ఇల్లు ఉంది వాళ్ళకి. ఇల్లు దొరికేదాకా ఒక గదిలో ఉండ నిమ్మందిట సీత. ఆవిడ ఒప్పుకోలేదు.

"ఆ తద్దినం నాకెందుకు! నాఇష్టం వచ్చినట్లు తిరక్కుండా ఈవిడకి ఎవరు కాపలా కాస్తారు? మా ఆయన అసలే మంచివాడు కాదు" అందిట పిన్నితో.

నాకు ఆశ్చర్యం వేసింది ఎవరికీ నమ్మకం ఉండదా భర్తమీద?

చదువుకున్నవాళ్లూ ఇంతేనా? భర్త మంచివాడు కాకపోయినా, నమ్మకం పోయినా అతడితో ఇంకా కాపరం చేస్తారా? తనని పోషించుకోగల స్థితిలో ఉన్నా అతడినే పట్టుకుని వేళ్లాడతారా? ఒకసారి పెళ్ళి అయితే ఇష్టం పోయినా ఆ బంధం మనసుల్ని కట్టేస్తుందా? మనిషిలో స్వార్థం ఉన్నంతకాలం మనిషికి మనిషే శత్రువు.

పురుషుడికి పురుషుడు శత్రువు కాదా!

నేను అనుకున్నట్లే జరిగింది.

ఆ రోజు బౌట్‌హౌసు రెండు గదులూ కడిగిస్తున్నాను.

ఆయన ఆఫీసునుంచి ఇంటికి వస్తూనే అన్నారు.

"ఏమిటి ఈ గదులు కడిగిస్తున్నావు! సీతగారికి ఇల్లు దొరకలేదుట. ఇద్దామా?" అన్నారు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెని అదుపులోకి తెచ్చుకున్నాను. ఆ రోజే అత్తగారి దగ్గిరనుంచి వచ్చిన ఉత్తరం ఆయనకి ఇచ్చాను. ఇక్కడికి వస్తున్నట్లు రాశారు. అంతకు ముందరే నేను మా అత్తగారికి నాకు వంట్లో బాగుండటం లేదని కొన్నాళ్ళు ఇక్కడ వచ్చి ఉండమనీ రాశాను. దానికి జవాబు వచ్చింది.

ఉత్తరం చదివి "సరేలే" అన్నారాయన.

"అసలు మా పిన్నివాళ్ళకి ఆఫీసు దూరమై ఇబ్బందిగా ఉందిట. మన ఔట్ హౌసులో ఉంటామని అడిగింది. ఇవ్వడెట్లా వీలవుతుంది. అత్తయ్యగారు వస్తున్నారు, వీలు కాదని చెప్తాను. అసలే మీ అమ్మగారికి మడి. ఒక గదిలో దేవుడ్ని పెట్టాలి. మనలాగ ఎట్లాపడితే అట్లాగ సర్దుకోరు ఆవిడ. ఈ రెండో గదిలో వంటకి ఏర్పాటుచేస్తాను," అన్నాను.

ఒకవేళ అత్తగారు రావటానికి వీలు కాదని రాస్తే మా పిన్నికి ఇల్లు ఇస్తానన్నాను అని చెప్తామనుకున్నాను. ఐనా నాకు తప్పుచేస్తున్నట్లు అనిపించలేదు. ఇల్లయితే ఇవ్వలేదు కానీ సీత మీద కుతూహలం పోలేదు నాకు.

అప్పుడప్పుడు వెళ్ళి చూసి వస్తుండేదాన్ని. సంగతులు ఎట్లాగో ఎవరి ద్వారానో తెలిసేవి. చివరికి శ్రీహరి గారింట్లో ఒక పోర్షన్ దొరికింది సీతకి. అతను బాగా తాగుతాడని మంచివాడు కాదని చెప్పుకుంటారు. కానీ బాగా డబ్బు ఉందిట.

"బయట మీ ఇష్టం వచ్చినట్లు తిరగండి. ఇంట్లోకి మాత్రం ఎవరినీ తేవద్దు అందిట రత్తమ్మ, ఆయన భార్య.

"నోటికి వచ్చినట్లు పేలకు" అన్నాడుట ఆయన.

"పుట్టింటికి పోతాను" అందిట ఆవిడ.

"పోతే పో" అన్నాడుట శ్రీహరి.

ఒకసారి నేను వెళ్ళాను. సీత ఇంకా ఇంటికిరాలేదు. రత్తమ్మ ఒక్కతేఉంది. ఆవిడ ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్తూ కడుపులో మండుతున్న మాట కూడా చెప్పింది.

"బయట ఏందేసుకుంటే నాకెందుకూ. ఇంట్లో గొడవలేదు. స్నేహంగా ఉంటుంది. నాతో మంచిగా మాట్లాడుతుంది సీతమ్మ. ఐనా ఆడవాళ్ళం సర్దుకుపోక ఏంచేస్తాం? మొగవాళ్ళు మనం వద్దు అంటే వింటారా? ఇదివరకు ఏడిచి పుట్టింటికి పోయేదాన్ని. ఏం లాభం? రెండు నెలలుండి ఇంక ఉండలేక మళ్ళీ వచ్చేసేదాన్ని. ఇప్పుడు దేనికీ బాధపడటంలేదు. బయట ఏంచేసుకుంటే నాకేం. నన్ను బాగానే చూస్తారాయన." అంది మెరుస్తున్న రాళ్ళ గాజులు సవరించుకుంటూ.

"కొత్తవా?" అనడిగాను వాటికేసి చూస్తూ.

"ఊ. శుక్రవారం పూజకి చేయించారు. పన్నెండు వందలయింది." అంది.

రత్తమ్మకి భర్తమీద నమ్మకం లేదు. అయినా ఏదో బంధానికి కట్టుబడిఉంది. ఆఫీసులోనూ ఊళ్ళోనూ సీత గురించి, శ్రీహరి గురించి రకరకాలుగా చెప్పుకుంటున్నారు. రత్తమ్మ చదువుకోలేదు. పల్లెటూరిది. ఆవిడ కన్నుగప్పి వీళ్ళిష్టమొచ్చినట్లుంటున్నారు అన్నారు. ఇంటికి అద్దె తీసుకోడు, పిల్లలకి అన్నీ తనే కొంటాడుట, ఊరికే ఎవరు చేస్తారు అవన్నీ అన్నారు. సీతకి మంచి అండ దొరికింది అన్నారు. ఇట్లాగనుకుంటున్నారని ఆయన కూడా నాకు చెప్తూండేవారు. ఒక్కొక్కసారి నమ్మకం కలిగేది. ఒక్కొక్కసారి నిజమయ్యుంటదనిపించేది.

ఒకసారి ఆయనకూడా

"మనం సీతగారికి ఇల్లు ఇవ్వకపోవటమే మంచిదయింది" అన్నారు.

ఎప్పుడైనా నేను ఇదివరకు పశ్చాత్తాపపడి ఉన్న ఆయన మాటలు విన్నప్పుడు మాత్రం మనసులో సంతోషం, గర్వంలాంటి భావంకూడా కలిగాయి.

మళ్ళీ ఒకసారి వెళ్ళినప్పుడు సీత ఇంట్లోనే ఉంది పిల్లలూ తనూ క్షేమంగా లోటు లేకుండా ఉన్నారనిపించింది. కాఫీ చేసి ఇచ్చింది.

"శ్రీహరిగారు చాలా మంచివారు. ఎన్నోవిధాలా సాయంగా ఉంటున్నారు. ఇల్లు ఇవ్వకపోతే నే నేమైపోయేదాన్నో తలుచుకుంటే భయంవేస్తుంది. ఈ కాలం ఉద్యోగం దొరకటమే కష్టంగా ఉంది. ఇల్లులేదని ఈ ఉద్యోగం వదిలేస్తే ఇంకెక్కడా నాకు మళ్ళీ ఉద్యోగం దొరకదు. అన్నయ్య, వదినలమీద ఆధారపడి నేనూ, నా పిల్లలూ ఏబాధలు పడాల్సి వచ్చేదో...ఆయన చేస్తున్న మేలు మరిచిపోలేను. రత్తమ్మగారు కూడా చాలా మంచిది." అంది.

సీత మాటలు నమ్మాను నేను. అందుకే నాకు

"మమ్మల్ని గురించే సీత ఈమాటలు అని ఉంటే?" అనిపించింది.

నేను సీతకి ఇల్లుఇచ్చి ఆదరించాలి. సీతని ఆయన అన్నయ్యలా చూడాలి. సీత నాకు కృతజ్ఞత చూపించాలి అని నా మనసులోని కోరిక. కానీ మళ్ళీ సీతకి ఇల్లు ఇవ్వటం తలుచుకుంటే మనసులో ఒణుకు బయలుదేరింది. ఆయన సీతని ఆకర్షించకుండా ఉండరు. సీత లోబడకుండా ఉండదు.

నేను అన్యాయమౌతాను. నేను నాలుగు గోడలమధ్యా ఉండేదాన్ని. చదువురాని దాన్ని, లోకంతెలియనిదాన్ని నా భర్తని రక్షించుకోవటం ఇంకెట్లాగో నాకు తెలియదు.

సీతకి సాయం చెయ్యలేక పోయాను కానీనలుగురు పిల్లల తల్లిని కాపాడాను నేను. నన్ను నేను రక్షించుకున్నాను. ఆయన సీతతో వ్యవహారం నడిపితే నేనూ నా పిల్లలూ ఏమైపోయేవాళ్ళం! ఏం చెయ్యగలను నేను! నన్నునేను పోషించుకోలేను. ఆయననా పరిధిలోంచి దాటి పోకుండా ఏమైనా చెయ్యాలి. చేస్తాను నేను. ఇది నా రహస్యం. ఇది మా అసలుకథ.




* * *

రత్తమ్మకి జబ్బు చేసిందని, పోయిందని తెలిసి వెళ్ళాను. మనసులో ఎన్నో ఆలోచనలు, సీత భవిష్యత్తు గురించి! శ్రీహరిగారిని సీత పెళ్ళి చేసుకోవటం ఒక పరిష్కారం అనికూడా అనుకున్నాను. రత్తమ్మ జరీచీర కట్టుకుని, వంటినిండా నగలు ధరించి వరండాలో నేలమీదే కూర్చుని ఉండేది. వెళ్ళగానే పలకరించేది, ఎప్పుడూనూ. ఆవిడ లేకపోవడంవల్ల వరండా అంతా చిన్నబోయినట్లుగా ఉంది. సరాసరి సీతా వాళ్ళింట్లోకి వెళ్ళాను రత్తమ్మని తలుచుకుని సీత కంట్లో నీళ్ళు పెట్టుకుంది.

"మొన్న రామారావుగారి భార్య వచ్చింది చూడటానికి. ఏమందో తెలుసా? ఇప్పుడు మళ్ళీపెళ్ళి చేసుకోవటం తప్పుకాదు. నువ్వు శ్రీహరిగారిని చేసుకుంటే బాగుంటుంది సీతా అంది," అని సీత ఒక నిముషం ఆగింది.

దానికి సీత ఏం జవాబు చెప్పిందోనని ఆతృతగా ఎదురు చూస్తున్నాను.

"నాకు చాలా బాధ వేసింది. ఆయన నాకు అన్నయ్యలాంటివారు. వేరే కోరిక" అవసరంకూడా నాకు లేవు. ఇంటికోసం లోన్ తీసుకున్నాను నేను. ఇల్లు కట్టిస్తున్నాను. చిన్నదే అనుకో. రెండు నెల్లో పూర్తవుతుంది. ఈ ఇంట్లోఉండి ఎన్ని మాటలు పడ్డానో! పడుతున్నానో. ఈ నరకం నుంచి విముక్తి దొరుకుతుంది. ఆయన ఎటువంటివారైనా శ్రీహరిగారు నాకు ఇల్లుఇచ్చి ఆశ్రయం కలిగించారు. రత్తమ్మగారు అందరి మాటలూ విని బాధపడేది కానీ నిజంగా మంచిదే. వాళ్ళకి నేనెప్పుడూ కృతజ్ఞురాలినే. నా కష్టాలన్నీ గడిచినట్లే ఇంక నా ఇంటికి వెళ్ళిపోతాను. నా పిల్లల్ని నేను పోషించుకోగలను. అంతేకాదు నాకు నచ్చిన వ్యక్తి తటస్థపడితే 'అతడిని' నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను," అంది సీత. సీత మొహంలో ఉన్న నవ్వుని పరికిస్తూ ఉండిపోయాను నేను.

